హెచ్ఒడిలకు ట్విన్ టవర్లు

- సచివాలయం సమీపంలో నిర్మాణం
- కుల వృత్తులకు ఆర్థిక సాయంపై రెండు రోజుల్లో విధివిధానాలు
- అమరుల స్మారకం ముందు తెలంగాణ తల్లి విగ్రహం
- ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు' ఘనంగా జరగాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను మరోసారి ఆదేశించారు. ఇటీవల సచివాలయంలో కలెక్టర్ల సమావేశం నిర్వహించిన తర్వాత ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించిన పురోగతి గురించి సోమవారం డా బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సిఎం కెసిఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ రెండు నుంచి రోజూ వారీగా నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖలు తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి సిఎంకు వివరించారు.

దేశం గర్వించేలా నిర్మించుకున్న డా బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఉద్యోగులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా విధి నిర్వహణకు అనువుగా గొప్పగా నిర్మాణమయ్యిందని, అధికారులు సిబ్బంది ఆహ్లాదకర వాతావరణంలో పనిచేస్తున్నారని సిఎం హర్షం వ్యక్తం చేశారు. సచివాలయం ప్రారంభించుకుని నెల రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో సచివాలయంలో మౌలిక వసతులు పూర్తవ్వడం గురించి, సౌకర్యాలు అందుబాటులోకి రావడం గురించి సిఎస్ శాంతకుమారిని సంబంధిత ఉన్నతాధికారులను సిఎం అడిగి తెలుసుకున్నారు.

అన్ని శాఖల హెచ్ఒడిలు ఒకే చోట

సచివాలయం పూర్తిస్థాయిలో పని విధానంలోకి వచ్చిన నేపథ్యంలో, ఆయా ప్రభుత్వ విభాగాధిపతుల (హెచ్ఒడి) కార్యాలయాలను ఒకే చోటకు చేర్చడం గురించి సిఎం చర్చించారు. హెచ్ఒడి అధికారులకు సెక్రటేరియట్‌తో తరచుగా పని ఉంటున్న నేపథ్యంలో వారి కార్యాలయాలను కూడా సెక్రటేరియట్ దగ్గర్లో సమీకృతంగా ఒకే చోట నిర్మించేందుకు సిఎం నిర్ణయించారు. అన్ని రంగాలకు చెందిన ప్రభుత్వ శాఖల్లోని హెచ్ఒడిలు వాటి ఆధ్వర్యంలో పని చేస్తున్న పూర్తిస్థాయి సిబ్బంది సంఖ్య, తదితర అంశాల గురించి అధికారులను సిఎం అడిగి తెలుసుకున్నారు. సెక్రటేరియట్‌కు అందుబాటులో విశాలవంతమైన ప్రభుత్వం స్థలాలు ఎక్కడెక్కడున్నాయో సిఎం అడిగితెలుసుకున్నారు. స్థల నిర్ధారణ తర్వాత అవసరం మేరకు, హెచ్ఒడిలన్నీ ఒకే చోట ఉండేలా ట్విన్ టవర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు సిఎం తెలిపారు.కుల వృత్తులకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వుందని సిఎం పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని బిసి, ఎంబిసి కులాలు కుల వృత్తులే ఆధారంగా జీవించే రజక, నాయి బ్రాహ్మణ, పూసల, బుడగజంగాల తదితర వృత్తి కులాలు, సంచార జాతులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందని సిఎం స్పష్టం చేశారు. వీరికి రూ.లక్షరూపాయల చొప్పున దశలవారీగా ఆర్థిక సాయం అందిస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఇందుకు సంబంధించి అమలు విధి విధానాలను మరోరెండు రోజుల్లో ఖరారు చేస్తామని సబ్ కమిటీ చైర్మన్, బిసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ సిఎంకు వివరించారు. త్వరిత గతిన విధి విధానాలు ఖరారు చేసి సంక్షేమ దినోత్సవం సందర్భంగా ప్రారంభించాలని సిఎం మంత్రి గంగులను ఆదేశించారు. సమీక్షా సమావేశం అనంతరం అమరుల స్మారకం వద్దకు సిఎం చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న నిర్మాణం పనులను పరిశీలిస్తూ కలియతిరిగారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పనులన్నీ పూర్తయి చివరి దశ సుందరీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. అమరుల స్మారకానికి ముందున్న విశాలమైన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహానికి రెండు వైపులా అత్యద్భుతమైన ఫౌంటేన్లతో సుందరంగా తీర్చిదిద్దాలని ఆర్అండ్‌బి ఇంజనీర్ శశిధర్‌ను సిఎం ఆదేశించారు. దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నన్ని రోజులు అమరుల స్మారకం వద్దకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా వుండే విధంగా ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అక్కడ నుంచి బిఆర్కే భవన్ వద్ద నిర్మించిన వంతెనల నిర్మాణాన్ని సిఎం పరిశీలించారు. నూతన సచివాలయ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసేందుకు ఈ వంతెనలను నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూధనాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి,దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి తో పాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సిఎం కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి భూపాల్ రెడ్డి, స్మితా సభర్వాల్, సిఎం వోఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సింగరేణి సిఎండి శ్రీధర్, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఈ ఈ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కెసిఆర్

వడదెబ్బతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు రోజులుగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, పరిసర గ్రామాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 45 నుంచి 46 సెంటీగ్రేడ్ల ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఈ క్రమంలో సోమవారం వడదెబ్బకు గురై పట్టణంలోని దీక్షిత్‌నగర్‌కాలనీలో నివాసముంటున్న భవన నిర్మాణ కార్మికురాలు పల్లపు మరియమ్మ(60), దద్దనాల చెరువు కాలనీలో నివాసం ఉంటున్న రోజువారి కూలీ పటాన్ ముస్తక్‌ఖాన్(74) మృతిచెందారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆర్ఎంపిపిఎంపిల అసిసోయేషన్ నాయకులు ఎస్‌కె మన్సూర్‌అలీ ప్రభుత్వాన్ని కోరారు.

బిసి గురుకుల ప్రవేశ పరీక్షా ఫలితాల విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

2023-24 విద్యా సంవత్సరంలో మహాత్మా జ్యోతిబాఫూలే బిసి గురుకుల విద్యాలయాల సంస్థ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలను బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశం సోమవారం విడుదల చేసినట్టు ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు. ఈ ఫలితాల్లో ఎంపిసిలో 150 మార్కులకుగాను 122 మార్కులతో మొదటి స్థానంలో సిద్ధిపేట జిల్లాకు చెందిన పి జ్యోత్స్న, బైపిసిలో నల్గొండ జిల్లాకు చెందిన పి శ్రీవల్లి 108 మార్కులతో, సిఇసిలో పెద్దపల్లి జిల్లాకు చెందిన కె.సాయి సంహిత 107 మార్కులతో, ఎంఈసీలో మేడ్చల్ జిల్లాకు చెందిన ఎ అర్చన 109 మార్కులతో అగ్ర స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు విద్యార్థులు తమకు కేటాయించిన కాలేజీల్లో చేరాలని సూచించారు. ఫలితాలను https://mjptbcwreis.telangana.gov.in వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని మల్లయ్య బట్టు తెలిపారు.

ఐకెప విఒఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

- సిఎం కెసిఆర్‌కు జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత, రూ.10 లక్షల బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని తెలిపారు. గుర్తింపు కార్డులివ్వాలని, అర్హులైన విఒఎలను సిసిలుగా పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. ఇతర న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

హజ్‌యాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హజ్‌యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. హైదరాబాద్‌లోని హజ్ కమిటీ భవనంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హజ్‌యాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఎయిర్ పోర్టు, రవాణా, పోలీసులు, జిహెచ్ఎంసి, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రభుత్వం అన్ని వసతులూ సమకూర్చినట్టు తెలిపారు. హజ్‌హౌస్‌లో అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నుంచి వివిధ శాఖల సహకారంతో ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేశామని తెలిపారు. యాత్రికులకు వసతి, బస, విమానాల టికెట్ బుకింగ్, బోర్డింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. హజ్‌హౌస్‌లో పాసులు, సామాను స్క్రీనింగ్, సామగ్రి చెక్‌ఇన్, మెడికల్, టీకా వంటి వసతులను అధికారులు ఏర్పాటు చేశారని తెలిపారు. శంషాబాద్ జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రత్యేక టెర్మినల్‌ను యాత్రికుల కోసమే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నారని వివరించారు. డయాస్, సిట్టింగ్ ఏర్పాట్లు, బస్ పాయింట్లలో దిగడం, సామాగ్రి స్క్రీనింగ్, చెక్ ఇన్ కౌంటర్లు, మొదలైనవి హజ్‌హౌస్‌లో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దాదాపు ఏడు వేల మంది హైదరాబాద్ నుంచి హజ్‌యాత్రకు వెళ్లనున్నారని తెలిపారు. జూన్ ఐదు నుంచి నుంచి హజ్ చార్టర్ విమానాలు నడుపుతారని, యాత్రికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ఈ-బుకింగ్ సిస్టమ్‌తోపాటు, మాన్యువల్ బుకింగ్ సిస్టమ్‌ను సౌకర్యాన్నీ కల్పించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, హజ్ కమిటీ చైర్మెన్ మహమ్మద్ సలీం, ప్రభుత్వ సలహాదారు ఎకె ఖాన్, వక్ఫ్ బోర్డు చైర్మెన్ మహ్మద్ మసిఉల్లాఖాన్, మైనార్టీ కార్పోరేషన్ ఉన్నతాధికారి షఫీ ఉల్లాఖాన్, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆప్టిమస్‌తో షావోమి జట్టు

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టివి బ్రాండ్ షావోమి ఇండియా తన 'మేక్ ఇన్ ఇండియా' ప్రయాణాన్ని బలోపేతం చేయడానికి ఆప్టిమస్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. కేబుల్‌రహిత ఆడియో ఉత్పత్తులను స్థానికంగా తయారు చేయడానికి ఈ ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొంది. ఈ విభాగంలో దేశీయ ఛాంపియన్లతో కార్యకలాపాల విస్తరణ, తయారీ భాగస్వామ్యాల ద్వారా షావోమి భారత్ పట్ల తన నిబద్ధతను బలోపేతం చేస్తుందని తెలిపింది. వచ్చే రెండేళ్లలో స్మార్ట్‌ఫోన్ దేశీయ విలువ జోడింపులో 50 శాతం పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

పది శాతం తరుగు డబ్బులను రైతుకు చెల్లించాలి

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు
- కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని, తరుగు పేరుతో కోతపెట్టిన పది శాతం ధాన్యం డబ్బులను రైతు ఖాతాలో చెల్లించాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం రైతులు నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి సాగు చేసిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొస్తే దళారులు నిలువునా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నిబంధనలూ పెట్టకుండా కొనుగోలు చేయాల్సి ఉందని, అధికారులు నిబంధనలను బేకాతర్ చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మార్కెట్లో కొనుగోళ్లలో సంచి దగ్గర రెండు కేజీల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని చెప్పారు. మిల్లర్లకు ప్రభుత్వమే తరుగు పేరుతో నూటికి పది రూపాయలు ఇస్తుంటే, మరో పది రూపాయలు రైతుల నుంచి ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలా ఒక లారీకి రూ.35 వేలు మిల్లర్లు లాభపడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆరుగాలం కష్టం చేసిన రైతుకు మిగిలేది నూటికి పది రూపాయలు అయితే.. అవీ దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఈ విధంగా దగా చేస్తుంటే ప్రజాప్రతినిదులు ఎందుకు నిలదీయడం లేదన్నారు. 2018 ఎన్నికలకు ముందు ఇస్తామన్న రుణమాఫీ ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటివరకు తూకం చేసి రైతుల దగ్గర నుంచి పది శాతం తరుగు పేరుతో తీసుకున్న ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు ఆయన్ని అరెస్టు చేశారు. దీన్ని నిరసిస్తూ ఆందోళనకారులు రాస్తారోకో చేశారు. రైతులతో చర్చలకు వచ్చిన జాయింట్ కలెక్టర్ మోతిలాల్ ఏమీ మాట్లాడకుండానే వెనుతిరిగి పోయారు. జూపల్లి కృష్ణారావుతోపాటు ఎంపిపి ప్రతాప్‌గౌడ్‌ను, ముఖ్య కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తీసుకెళ్లారు.

కలెక్టరేట్ ముట్టడించిన రైతులు

సిఆర్‌టిలకు 12 నెలల వేతనం

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్టీ)కు 12 నెలల వేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం వారికి 10.5 నెలలకు మాత్రమే వేతనం ఇస్తున్నామని తెలిపారు. ఇతర గురుకులాల తరహాలో 2022-23 విద్యాసంవత్సరం నుంచే 12 నెలల వేతనం ఉత్తర్వులను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ హర్షం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు 12 నెలల వేతనం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి హర్షం ప్రకటించారు. సీఆర్టీలకు 12 నెలల వేతనం మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు టి హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌కు పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆ కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలి

- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో రెగ్యులరైజ్ కాని కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జనరల్, ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులు, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు కొంతమందిని రెగ్యులరైజ్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ఇంకా కొద్దిమంది క్రమబద్ధీకరణ కాలేదని పేర్కొన్నారు. వారికీ తగిన సడలింపులివ్వాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 184 మంది ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లను మాత్రమే క్రమబద్ధీకరించారని వివరించారు. ఇంకా 417 మందిని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో సుమారు 823 మంది కాంట్రాక్టు అధ్యాపకులు 20 ఏండ్లుగా పనిచేస్తుంటే, కేవలం 270 మంది మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేశారని పేర్కొన్నారు. వివిధ కారణాలతో 553 మంది కాంట్రాక్టు అధ్యాపకులు క్రమబద్ధీకరణ కాలేదని తెలిపారు.

డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు

రాష్ట్రంలో 494 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు నెట్, సెట్, పిహెచ్‌డీ అదనపు విద్యార్హతలు లేవనే కారణంతో క్రమబద్ధీకరణ జాబితాలో చేర్చలేదని తమ్మినేని తెలిపారు. వారందరూ 2014, జూన్ రెండో తేదీకి ముందే విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు.

గతంలోనూ జూనియర్ లెక్చరర్ల నుంచి డిగ్రీ లెక్చరర్లుగా పదోన్నతి ఇచ్చే సమయంలో అదనపు విద్యార్హతలకు కొంత కాలపరిమితి ఇచ్చారని వివరించారు. మిర్యాలగూడలోని కేఎన్ఎం అన్‌ఎయిడెడ్ డిగ్రీ కళాశాలను 2018, ఏప్రిల్ ఆరో తేదీన జిఒ నెంబర్ 10 ప్రకారం స్వాధీనం చేసినపుడు 18 మంది బోధన సిబ్బంది, అదనపు విద్యార్హతతో నెట్, సెట్ మినహాయింపుతో తీసుకుని రాష్ట్ర పేస్కేళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. 2022, జులై 23న జీవోనెంబర్ 27 ద్వారా చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబ్‌నగర్ అన్ ఎయిడెడ్ కాలేజీని స్వాధీనం చేసినపుడు ఎనిమిది మంది బోధనా సిబ్బందికి నెట్, సెట్ అదనపు విద్యార్హతలో మినహాయింపులిచ్చి రాష్ట్ర పేస్కేల్లు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మిగిలిపోయిన వారికీ ఐదేళ్ల కాలపరిమితినిచ్చి క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. 2014, జూన్ రెండో తేదీ కంటే ముందే 33 మంది కాంట్రాక్టు అధ్యాపకులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ప్రస్తతం నెట్, సెట్, పీహెచ్‌డీ సంపాదించారని పేర్కొన్నారు. కానీ క్రమబద్ధీకరణ జాబితాలో వారి పేర్లు ఉన్నత విద్యాశాఖకు అందలేదని పేర్కొన్నారు. వారినీ జాబితాలో చేర్చాల్సిన అవసరముందని సూచించారు. 2014, జూన్ రెండో తేదీ తర్వాత 26 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్నారని, నెట్, సెట్, పిహెచ్‌డి విద్యార్హతలున్నాయని, వారికి సడలింపులివ్వాలని కోరారు.

జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు :

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులరైజ్ కాకుండా మిగిలిపోయిన సుమారు 417 మంది ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులను మంజూరు చేసి, అర్హతల్లో సడలింపులిచ్చి క్రమబద్ధీకరించాలని తమ్మినేని తెలిపారు. జనరల్ కోర్సుల్లో పనిచేస్తున్న 23 మందికి అవార్డ్ ఆఫ్ పాస్ డివిజన్ సమస్య ఉందని పేర్కొన్నారు. అలాగే మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) బోధిస్తున్న 15 మంది కాంట్రాక్టు అధ్యాపకుల విషయంలో 60 శాతం మార్కులు దాటి ఉన్నప్పటికీ 'అవార్డ్ ఆఫ్ పాస్' డివిజన్ లేదనే కారణంతో రెగ్యులరైజ్ చేయలేదని తెలిపారు. వారి విషయంలో మార్కులను పరిగణనలోకి తీసుకుని క్రమబద్ధీకరించాలని కోరారు.

నాట్కో ఫార్మా లాభాల్లో 345% వృద్ధి

హైదరాబాద్ : ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 345 శాతం వృద్ధితో రూ.275.8 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.50.5 కోట్లు, గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో రూ.62.3 కోట్ల చొప్పున లాభాలు ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ రెవెన్యూ క్రితం క్యూ4లో 51.80 శాతం పెరిగి రూ.926.9 కోట్లుగా చోటు చేసుకుంది. 2021-22 క్యూ4లో రూ.610.6 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. ఆర్థిక సంవత్సరం 2022-23లో స్థూలంగా నాట్కో రెవెన్యూ 37.6 శాతం పెరిగి రూ.2811.7 కోట్లుగా నమోదయ్యింది. కంపెనీ లాభాలు రూ.715.3 కోట్లుగా ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది రూ.170 కోట్ల లాభాలతో సరిపెట్టుకుంది. బ్రిటన్ కంపెనీ జిస్టా ఫార్మాను పూర్తిగా స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపింది. అదే విధంగా కొలంబియాలో లక్ష డాలర్ల లోపు పెట్టుబడితో అక్కడ ఓ సబ్సీడరీ కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. సోమవారం బిఎస్ఇలో నాట్కో షేర్ విలువ 0.91 శాతం పెరిగి రూ.635.10 వద్ద ముగిసింది.

మోబిల్ ప్రచారకర్తగా హృతిక్ రోషన్

న్యూఢిల్లీ : చమురు ఉత్పత్తుల కంపెనీ మోబిల్ తన బ్రాండ్ అంబాసీడర్‌గా హృతిక్ రోషన్‌ను నియమించుకున్నట్లు తెలిపింది., "భారత్‌లో మోబిల్ లూబ్రికెంట్స్ కోసం హృతిక్ రోషన్‌తో భాగస్వామ్యం మాకు ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తుంది. దేశ లూబ్రికాంట్ అవసరాలను పూరిస్తామనే మా మాటకు వ్యాపార భాగస్వాములు, వినియోగదారులలో విశ్వాసం కలిగించేలా హృతిక్ వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుందని మేము నమ్ముతున్నాము." అని ఎక్సాన్ మొబిల్ లూబ్రికెంట్స్ సిఇఒ విపిన్ రాణా పేర్కొన్నారు.

ఐటి రంగంలో తగ్గిన ఎఫ్‌డిఐలు

- 2022-23లో 22% పతనం

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంత్సరం 2022-23లో భారత్‌లోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లు 22 శాతం పతనమై 46 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) గణంకాలు తెలిపాయి. ముఖ్యంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఎఫ్‌డిఐలు తగ్గాయని వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది 2021-22లో 58.77 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు నమోదయ్యాయి. ఈక్విటీ, ఇతర పెట్టుబడులను కలిపి స్థూలంగా 2022-23లో 16.3 శాతం పతనమై 70.97 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని డిపిఐఐటి తెలిపింది. ఇంతక్రితం ఏడాదిలో 84.83 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు చోటు చేసుకున్నాయి. తయారీ రంగం, కంప్యూటర్ సర్వీసెస్, కమ్యూనికేషన సర్వీసెస్‌లో అధికంగా ఎఫ్‌డిఐలు పడిపోయాయి. 2022-23 ఏప్రిల్ నుంచి మార్చి కాలంలో సింగపూర్ నుంచి అత్యధికంగా 17.2 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు వచ్చాయి. మారిషాస్ నుంచి 6.13 బిలియన్లు, అమెరికా నుంచి 6 బిలియన్లు, యుఎఇ నుంచి 3.35 బిలియన్ల పెట్టుబడులు నమోదయ్యాయి. నెథర్లాండ్స్ నుంచి 2.5 బిలియన్లు, జపాన్ (1.8 బిలియన్లు), బ్రిటన్ (1.73 బిలియన్లు), సైప్రస్ (1.27 బిలియన్లు) తదితర దేశాల నుంచి పెట్టుబడులు వచ్చాయి. మారిషాస్, అమెరికా, నెథర్లాండ్స్, జర్మనీ దేశాల నుంచి వచ్చే ఎఫ్‌డిఐల్లో అధిక తగ్గుదల చోటు చేసుకుంది. 2021-22లో ఆటోమొబైల్ రంగంలోకి 7 బిలియన్ల పెట్టుబడులు రాగా.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1.9 బిలియన్లు మాత్రమే వచ్చాయి. 2022-23లో మహారాష్ట్రలోకి అత్యధికంగా 14.8 బిలియన్ల పెట్టుబడులు వచ్చినప్పటికీ.. ఇంతక్రితం ఏడాది 15.44 బిలియన్లతో పోల్చితే తక్కువగానే నమోదయ్యాయి. కర్నాటక రాష్ట్రంలోకి 10.42 బిలియన్లు, గుజరాత్‌లోకి 4.71 బిలియన్ల చొప్పున వచ్చాయి. తమిళనాడు, తెలంగాణ, హర్యాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోకి వచ్చే ఎఫ్‌డిఐల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాల్లో ఈక్విటీ రంగంలోకి వచ్చే ఎఫ్‌డిఐల్లో భారీ తగ్గుదల నమోదయ్యింది.

మంత్రి సబితకు వినతిపత్రం అందజేస్తున్న టిప్స్, టిగ్లా, జిసిఎల్ఎ నాయకులు

మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలి

- మంత్రి సబితకు టిప్స్, టిగ్లా, జిసిఎల్ఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మిగిలిన ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులనూ క్రమబద్ధీకరించాలని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి (టిప్స్), తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్ల సంఘం (టిగ్లా), ప్రభుత్వ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (జిసిఎల్ఎ-475) డిమాండ్ చేశాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో టిప్స్ కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, టిగ్లా అధ్యక్షులు ఎం జంగయ్య, జిసిఎల్ఎ అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఐదేండ్లుగా ఉద్యోగులకు బదిలీల్లేకపోవడం వల్ల మానసిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి బాధలను గమనించి సత్వరమే బదిలీలు చేపట్టాలని కోరారు. బోధనేతర సిబ్బందికి పది శాతం జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని సూచించారు. జూనియర్ కాలేజీలో పున:ప్రారంభం అయ్యాక విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు వచ్చేలా చూడాలని కోరారు. కాలేజీల ప్రారంభం నుంచే అతిథి అధ్యాపకులను కొనసాగించాలని తెలిపారు. కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలని, స్వీపర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లను నియమించాలని సూచించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే అధికారులు, సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మంజు నాయక్, సైదులు, లాలు, బిక్యానాయక్, జ్యోతి, వస్కుల శ్రీనివాస్, ఎం శ్రీనివాస్‌రెడ్డి, కెపి శోభన్‌బాబు, సంగీత, గాయత్రి, హరి, గోపాల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపి రంగనాథ్

అక్రమంగా లింగనిర్ధారణ పరీక్షలు

- 18మంది అరెస్ట్ : వరంగల్ సిపి రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హన్మకొండ జిల్లాలో అక్రమంగా లింగనిర్ధారణ పరీక్షలకు పాల్పడుతూ గర్భస్రావాలు చేస్తున్న 18 మందిని హ్యూమన్ ట్రాఫికింగ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారని, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎవి రంగనాథ్ తెలిపారు. వారి నుంచి మూడు లింగనిర్ధారణకు వినియోగించే స్కానర్లు, 18 సెల్‌ఫోన్లు, రూ.73 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వరంగల్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనపై సిపి వివరాలు వెల్లడించారు. అరెస్టయిన వారిలో వేముల ప్రవీణ్, వేముల సంధ్యారాణి, డాక్టర్ బాల్నె పార్థు, డాక్టర్ మోరం అరవింద, డాక్టర్ మోరం శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ బాల్నె పూర్ణిమ, వార్ని ప్రదీప్‌రెడ్డి, కైత రాజు, కల్లా అర్జున్, డి ప్రణయ్‌బాబు, కీర్తి మోహన్, బాల్నె ఆశలత, కొంగర రేణుక, భూక్యా అనిల్, చెంగెల్లి జగన్, గన్నారపు శ్రీలత, బండి నాగరాజు, కాసిరాజు దిలీప్ ఉన్నారు.

ప్రధాన నిందితుడు వేముల ప్రవీణ్‌కు గతంలో స్కానింగ్ కేంద్రంలో టెక్నీషియన్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనుకొని తన భార్య సంధ్యారాణితో కలిసి గోపాల్‌పూర్ వెంకటేశ్వర కాలనీలో కొద్ది మంది సిబ్బందితో పోర్టబుల్ స్కానర్ల సహాయంతో స్కానింగ్ కేంద్రాన్ని రహస్యంగా నిర్వహిస్తున్నారు. ఈ స్కానింగ్ కేంద్రానికి ఆర్ఎంపిలు, పిఆర్ఒలు, ఆస్పత్రి మేనేజ్‌మెంట్, సిబ్బంది, డాక్టర్లతో కలిసి ఒక నెట్‌వర్క్‌గా ఏర్పాటు చేసుకొని వారి సాయంతో గ్రామీణ ప్రాంతాల నుంచి గర్భిణులను లింగనిర్ధారణ పరీక్షల కోసం నగరానికి తీసుకొచ్చేవారు. లింగనిర్ధారణకు వచ్చే మహిళలకు పరీక్షలు చేసి పుట్టబోయేది ఆడబిడ్డ అయితే గర్భస్రావం కోసం ఈ ముఠాకు చెందిన ఆస్పత్రులు.. హన్మకొండలో లోటస్, గాయత్రి ఆస్పత్రులు, నెక్కొండలోని ఉపేందర్ (పార్థు ఆస్పత్రి), నర్సంపేటలోని బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సంబంధింత డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడి పంపించేవారు. ఇందుకోసం ఒక్కొక్క గర్భస్రావానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు డబ్బులు వసూలు చేసి వాటిని ఆ ముఠా సభ్యులు కమిషన్ల రూపంలో పంచుకునే వారు. ఇప్పటి వరకు ఈ ముఠా 200 కుపైగా గర్భస్రావాలు చేశారు. అక్రమంగా లింగానిర్ధారణ పరీక్షలు చేస్తున్నందుకు గతంలోనూ ప్రవీణ్‌ను హన్మకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన అదనపు డిసిపి పుష్ప, టాస్క్‌ఫోర్స్ ఎసిపి జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సుజాత, శ్రీనివాసరావు, జనార్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్, ఎస్ఐలు ఫసీయుద్దీన్, మల్లేశం, శరత్‌కుమార్, భాగ్యలక్ష్మి, ఎఎఒ సాల్మన్, ఎహెచ్‌టియు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ సమీయుద్దీన్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సైబర్ క్రైం సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, చైల్డ్ కోఆర్డినేటర్లు కృష్ణమూర్తి, కృతిను పోలీసు కమిషనర్ అభినందించారు.

DECCAN POLYPACKS LIMITED
Regd. Office : Plot No. A-40, Road No. 7, IDA Kukatpally, Hyderabad-37, Telangana, Ph : 040-23077224

KEY FINANCIAL HIGHLIGHTS OF STANDALONE AUDITED FINANCIAL RESULTS

Rs. in Lakhs except per share data

Sl. No.	Particulars	Quarter Ended 31.03.2023	Quarter Ended 31.03.2022	Year ended 31.03.2023	Year ended 31.03.2022
1.	Total income from operations	42.86	55.08	42.86	60.85
2.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	34.30	52.71	29.57	51.29
3.	Net Profit /(Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items)	34.30	52.71	29.57	51.29
4.	Net Profit/(Loss) for the period after tax (after Exceptional and /or Extraordinary items)	34.30	52.71	29.57	51.29
5.	Total Comprehensive income for the period [Comprising Profit / (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	34.30	52.71	29.57	51.29
6.	Equity share Capital	211.50	211.50	211.50	211.50
7.	Reserves Excluding (Revaluation Reserve) as Shown in the Audited Balance Sheetof Previous year	0	0	0	0
8.	Earnings Per Share(of Rs.10/-each) (for continuing and discontinued operations) 1. Basic : 2. Diluted :	1.62 1.62	2.49 2.49	1.40 1.40	2.43 2.43

Notes:
1. The above is an extract of the detailed format of Aduited Standalone Financial Results of the company for the quarter and year ended 31st March, 2023, filed with Stock Exchange under Regulation 33 of the SEBI (Listing and other Disclosure Requirements) Regulations 2015.
2. The above results were reviewed by the Audit Committee and were thereafter approved by the Board of Directors at their meeting held on 29th May, 2003.
3. As the Company has suspended it's manufacturing operations and has sold of its land, buildings and manufacturing facilities and in the absence of final action plan / affairs and operations of the Company, The Financial Statements of the Company have not been prepared on a going concern basis. These Financial Statements / results have been prepared on a realisable value basis.
4. The previous financial period figures have been regrouped / re-arranged/re-stated wherever considered necessary.

Place : Hyderabad
Date : 29th May, 2023

For **Deccan Polypacks Limited**
DRSP RAJU
Director

మైనారిటీలపై మతోన్మాదుల దమనకాండ

ఆవాజ్, తెలంగాణ గిరిజన, ఆదివాసీ గిరిజన సంఘాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లో ఆదివాసీ కుకీ, నాగ గిరిజన తెగలపై జరుగుతున్న దమనకాండను ఆపాలని ఆవాజ్, తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీలు సోమవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు, గృహ దహనాలు ఆపాలనీ, మణిపూర్‌లో శాంతియుత పరిస్థితి నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశాయి. ప్రజాస్వామ్యానికి ప్రతీకైన పార్లమెంటు భవనాన్ని ఘనంగా ప్రారంభించుకున్న వేళ, మణిపూర్ ఆదివాసీ గిరిజనుల ఆర్తనాదాలతో దద్దరిల్లిందని తెలిపాయి. కాల్పుల్లో అనేకమంది చనిపోయారనీ, అసమ్మతిని దాడులతో అణిచివేయడం తగదని ఆయా సంఘాల నేతలు హితవు పలికారు. బుధవారం ఈ అంశంపై ఆవాజ్, తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల ప్రధాన కార్యదర్శులు మహ్మద్ అబ్బాస్, ఆర్ శ్రీరాం నాయక్, పూసం సచిన్ తెలిపారు.

రైతు వేదికలను ముస్తాబు చేయండి

మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ మూడున రైతువేదికలను ముస్తాబు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. దశాబ్ది ఉత్సవాలు వ్యవసాయ శాఖతో ప్రారంభం కావడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో దశాబ్ది ఉత్సవాలు, వ్యవసాయ శాఖ చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి, రైతాంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాలు చారిత్రక జ్ఞాపకంగా మిగిలిపోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం సాధించిన విజయాలను తెలియపరుస్తూ...పెద్ద ఎత్తున పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతువేదికల్లో పండుగ వాతావరణం కనిపించాలని అన్నారు. వ్యవసాయ మార్కెట్లను మామిడి తోరణాలు, లైట్లతో అలంకరించి రైతులతో సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, అన్ని జిల్లాల డిఎఒలు తదితరులు పాల్గొన్నారు.

శివ నారాయణ్ జ్యువెలర్స్ గిన్నిస్ రికార్డ్స్

హైదరాబాద్ : నగరంలోని ప్రముఖ వారసత్వ ఆభరణాల తయారీ సంస్థ శివ నారాయణ్ జ్యువెలర్స్ ఎనిమిది గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌ను సాధించినట్లు ప్రకటించింది. చరిత్రలో అటువంటి ఘనతను సాధించిన మొదటి భారతీయ ఆభరణాల వ్యాపార సంస్థగా అవతరించిందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తుషార్ అగర్వాల్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ వేడుకలో బాలీవుడ్ ఫ్యాషన్ ఐకాన్ దిశా పటానీ, శివ నారాయణ్ అత్యున్నత ఆభరణాలను ధరించి ర్యాంప్‌పై ప్రదర్శించారు. 1011.150 గ్రాముల బరువైన గాణేష్ లాకెట్టు, దానిపైన ఉంచిన అత్యధిక సంఖ్యలోని వజ్రాలు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్‌ను సాధించాయని తుషార్ తెలిపారు. చేతితో తయారు చేసిన ఈ ఆభరణాన్ని రూపొందించడానికి ఆరు నెలలు సమయం పట్టిందన్నారు. రామ్ దర్బార్ భారీ లాకెట్టు, సత్లాద నెక్లెస్ తదితర ఇలాంటి అనేక వినూత్న ఉత్పత్తులను ఆవిష్కరించి రికార్డులు సాధించామన్నారు.

అమరవీరులను కించపరిచేలా వ్యాఖ్యలు

నిరంజన్

ప్రజాశక్తి-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవవేడుకలు చేయడం హాస్యాస్పదమంటూ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించడం ద్వారా అమరవీరులను కించపరిచారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. జూన్2న సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. గన్‌పార్క్ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద వేలాది మందితో అమరవీరులకు నివాళులు అర్పిస్తామని తెలిపారు. గాంధీ భవన్ వద్ద జాతీయ జెండా ఎగురవేసి బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. హరీష్‌రావు తన మాటలతో తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.

భూపోరాట పేదలపై ఖాకీల జులుం

- కోరుట్లలో అర్ధరాత్రి గుడిసెల తొలగింపు
- ఆందోళనకు దిగిన మహిళలను అడ్డుకున్న పోలీసులు
- రాష్ట్ర నాయకుడు బాలకృష్ణను ఈడ్చుకెళ్లి స్టేషన్‌కు తరలింపు
- నాయకులు, పలువురు మహిళలకు గాయాలు
- ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ పోరాటం ఆపబోం
- సుమారు రెండు గంటలపాటు ఉద్రిక్తత
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఖండన

ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇళ్ల స్థలాల కోసం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని సిపిఎం ఆధ్వర్యంలో పోరాడుతున్న పేదలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుడిసెల్లో ఉన్న నాయకులను, యువకులను బలవంతంగా అరెస్టు చేశారు. ఆపై రెవెన్యూ అధికారులతో కలిసి గుడిసెలన్నింటినీ కూల్చేశారు. పేదలంతా కష్టపడి తవ్వుకున్న బావిని సైతం పూడ్చారు. దాంతో ఉదయం 8గంటలకే మహిళలంతా ఆర్‌డిఒ ఆఫీస్‌కు చేరుకున్నారు. అప్పటికే మోహరించిన పోలీసులు మహిళలను అడ్డుకున్నారు. ర్యాలీ చేపట్టేందుకు వచ్చిన సిపిఎం రాష్ట్ర నాయకుడు బాలకృష్ణను ఈడ్చుకెళ్లి స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో మహిళలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దొరికినోళ్లను దొరికినట్టుగా మహిళలనీ చూడకుండా పోలీసులు లాగిపడేశారు. సుమారు రెండు గంటలపాటు ఉద్రిక్తత ఏర్పడింది.

గుడిసెలు కూల్చి.. నాయకులను అరెస్టు చేసి

49 రోజులుగా సాగుతున్న భూపోరాటాన్ని పలు విధాలుగా అడ్డుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం ఇక దాడులకే దిగింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో కరెంటు నిలిపివేసి చిమ్మచీకట్లో దాడులకు తెగబడింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా వచ్చి జెసిబిలతో గుడిసెలను ధ్వంసం చేశారు. అక్కడే పేదలు తవ్వుకున్న బావిని సైతం కూల్చివేశారు. అక్కడే నిద్రిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ సహా యువకులను అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న పేదలంతా సోమవారం ఉదయ ఎనిమిది గంటలకే పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకున్నారు.

భారీ ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపేందుకు సిద్ధమైన వారందరినీ అప్పటికే ఆర్‌డిఒ ఆఫీసు పరిసరాల్లోని గల్లిగల్లీలో మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి చేరుకున్న సిపిఎం రాష్ట్ర నాయకుడు లెల్లెల బాలకృష్ణను చుట్టుముట్టి ఈడ్చుకెళ్లి స్టేషన్‌కు తరలించారు. దీంతో కోపోద్రిక్తులైన మహిళలు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువురి మధ్య తోపులాట చోటుచేసుకుంది. 'నిలువనీడ లేని మాకు కనీసం 60గజాల స్థలం ఇవ్వరా?' అంటూ నిలదీశారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెబుతున్నారే తప్ప ఎక్కడా ఒక్క ఇల్లు ఇచ్చిందని లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో విలువైన భూములను పెద్దలు కబ్జా చేసినా పట్టించుకోని సర్కారు నిలువ నీడ కోసం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న తమపై దాడులు చేస్తారా? అంటూ ఆగ్రహించారు. అప్పటికే పెద్దఎత్తున చేరుకున్న పోలీసులు మహిళలను చెదరగొట్టారు. సిపిఎం రాష్ట్ర నాయకుడు బాలకృష్ణ, జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్, పట్టణ కన్వీనర్ పోచయ్య, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ గుమ్మడి రమేష్ సహా 36 మంది పేదలను అరెస్టు చేశారు.

నిర్విరామ పోరాటం

కోరుట్ల పట్టణంలో సుమారు వెయ్యి మందికిపైగా పేదలు సిపిఎం రాష్ట్ర నాయకుడు లెల్లల బాలకృష్ణ, జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని భూపోరాటం చేస్తున్నారు. ఏప్రిల్ 10వ తేదీన ప్రారంభమైన ఈ భూపోరాటం 49 రోజులుగా సాగుతోంది. పోరాటం ప్రారంభమైన పది రోజులకే అధికారపార్టీ కౌన్సిలర్, అతని అనుచరులు సిపిఎం నాయకునిపై దాడి చేశారు. చంపుతామనీ బెదిరించారు. వెన్నుచూపని దీరుల్లా ఎర్రజెండా నాయకులు తమ పోరాటం ఆగబోదని స్పష్టం చేస్తూ పేదలతో కలిసి మరింత ఉధృతం చేశారు. గుడిసెలు వేసుకున్న భూమిలో పేదలంతా కలిసి ఓ బావిని సైతం తవ్వుకున్నారు. అక్కడే నివసిస్తున్నారు. కలెక్టర్, ఆర్‌డిఒ స్థాయి మొదలు అధికారులందరికీ వినతులు ఇస్తూ వస్తున్నారు. ధర్నాలు, ర్యాలీలూ నిర్వహించారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా పిల్లాపాపలతో మహిళలు పెద్దఎత్తున గుడిసెలు వేసున్న స్థలంలోనే నిరసన చేపట్టారు. ఆ స్థలానికి పూలే, అంబేద్కర్‌నగర్ పేర్లు పెట్టుకుని 49 రోజులుగా అక్కడే ఉంటూ పనులకు వెళ్తున్నారు కోరుట్లలో పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చేసి మహిళలు, నాయకులను అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

శంకుస్థాపన సభలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

రాచరికాన్ని ముందుకు తెస్తున్న మోడీ సర్కార్

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ విలువల్ని కాలరాసి రాచరికాన్ని ముందుకు తెస్తున్న మోడీ సర్కార్ విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడం గ్రామంలో సోమవారం పుచ్చల పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నూతన భవన నిర్మాణానికి చెరుపల్లి శంకుస్థాపన చేశారు. అనంత రం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో మొదటి ప్రతిపక్ష నాయకుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ పుచ్చలపల్లి సుందరయ్య పేరున నిర్మించే విజ్ఞాన కేంద్రం గ్రామంలో విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన, సామాజిక సేవాదృక్పథం పెంపొంది స్తుందన్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం మనదన్నారు. పార్లమెంటు భవనం ప్రారంభోత్సవంలో భారత లౌకిక, సారభౌమత్వానికి వ్యతిరేకంగా క్రతువులు నిర్వహించి, దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాచరికపు కాలంనాటి రాజదండాన్ని పట్టుకుని మత మౌఢ్యంతో పూజలు నిర్వహించడం, భారత రాష్ట్రపతిని ఆహ్వానించకుండా సాధువులు, సన్యాసుల కాళ్లకు దండం పెట్టడం ఏంటని ప్రశ్నించారు. మోడీ నియంతలా వ్యవహరిస్తూ దేశ ప్రతిష్ఠతను దెబ్బతీశారని విమర్శించారు. చట్టాలను రూపొందించే భారత పార్లమెంటును మత ఛాందసాల కేంద్రంగా మార్చడంలో బిజెపి పాలన లక్ష్యం ఎమిటో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అదే సమయంలో నిరసన తెలిపిన రెజ్లర్లపై దాడి హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

2న గన్‌పార్కు నుంచి ర్యాలీ

మహేష్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి-హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని జూన్ 2న గన్‌పార్కు నుంచి గాంధీభవన్‌కు ర్యాలీ నిర్వహిస్తామని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. అందుకోసం పార్టీ పక్షాన కమిటీని నియమిస్తామన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఎవరివల్ల వచ్చిందో ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అందరూ ఎలా మోసపోయారనే విషయాన్ని ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర సాధన కోసం కష్టపడిన ఎంపిలు, ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు సన్మానం చేస్తామ న్నారు. కెసిఆర్ కుటుంబానికి తప్ప రాష్ట్రంలోని ఉద్యమకారులకు ఉద్యోగాలు దక్కలేదన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలు ఇంకా సహాయం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. బంగారు తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయన్నారు. ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి కెసిఆర్ ప్రజలందరినీ మోసం చేశారని చెప్పారు. కెసిఆర్‌కు ఓటేస్తే తెలంగాణ భూములు ఆక్రమించుకున్నారని విమర్శిం చారు.సోనియా స్థానంలో ఇంకెవరూ ఉన్న తెలంగాణ వచ్చేది కాదన్నారు.

కర్ణాటక సిఎంను కలిసిన విహెచ్

ప్రజాశక్తి-హైదరాబాద్

కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను బెంగళూరులోని ఆయన నివాసంలో కలిసి మాజీ ఎంపి వి హనుమంతరావు సోమవారం కలిశారు. జూన్‌లో తెలంగాణలో జరగనున్న బిసి గర్జన సభకు ముఖ్యఅతిథిగా రావాలని ఆయన్ను కోరారు. ఇదే విషయమై తెలంగాణ పిసిసి అధ్యక్షులు, సిఎల్‌పి నేత కూడా ఆహ్వానం అందిస్తారని తెలిపారు. విహెచ్ వెంట తమిళనాడు పిసిసి అధ్యక్షులు కెఎస్ అళగరి తదితరులు ఉన్నారు. కర్ణాటక సిఎంగా ఎంపికైనందుకు ఆయనకు విహెచ్ అభినందనలు తెలిపారు.

విద్యా, పరిశోధనల్లో విదేశీ వర్సిటీలతో భాగస్వామ్యం

మంత్రి సబితతో సింగపూర్ నాన్యాంగ్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యా, పరిశోధన రంగాల్లో రాష్ట్రంలోని పలు వర్సిటీలు విదేశీ వర్సిటీలతో భాగస్వామ్యం చేసుకుంటున్నాయి. అందులో భాగంగా సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (ఎన్‌టీయూ)తో సహకారాన్ని తీసుకుం టున్నాయి. నాన్యాంగ్ టెక్నాలజికల్ వర్సిటీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎమిరైటస్ మెటీరియల్స్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బీవీఆర్ చౌదరి సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డితో భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ వి వెంకటరమణ, ఓయూ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ పాల్గొన్నారు. ఎన్‌టీయూ ప్రత్యేకతలు, తాజా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రత్యేకించి సింగపూర్‌లో గల అపార ఉద్యోగావకా శాలతో పాటు, భారతీయ విశ్వవిద్యాలయాలు, తెలంగాణ వర్సిటీ ల్లోని విద్యా, పరిశోధన, ఉపాధి అవకాశాలపై వారు చర్చించారు.

ఉన్నత విద్యకు గమ్యస్థానం తెలంగాణ : మంత్రి సబిత

పలు రంగాల్లో వేగంగా దూసుకుపోతున్న తెలంగాణ ఉన్నత విద్యతోపాటు అన్ని రంగాలకూ ఉత్తమ గమ్యస్థానంగా కొనసాగుతున్నదని విద్యాశాఖ మంత్రి పి సబితాఇంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రం ఇప్పటికే లైఫ్‌సైన్సెస్, ఐటీ, బయోటెక్నాలజీ, ఫార్మా ఇతర రంగాల్లో హబ్‌గా అవతరించిందని, విద్యా, ఇంక్యుబేషన్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేయడంలో, పరిశోధనల్లో ఉత్తమంగా ఉందన్నారు. వర్సిటీ ప్రతినిధి బృందం వచ్చే జూలైలో రాష్ట్రంలో పర్యటిస్తుందని, ఆ క్రమంలో అకడమిక్ సహకారం పటిష్టమవుతుందన్నారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో పరిశోధనలను మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరముందని ప్రొఫెసర్ బీవీఆర్ చౌదరి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. తెలంగాణ వర్సిటీలను బలోపేతం చేయడంతోపాటు, ఉమ్మడిగా పరిశోధనా ప్రాజెక్టలను చేపట్టేందుకు సహకారాన్ని అందిస్తుందన్నారు.

విఒఎలను అడ్డుకున్న పోలీసులు.. అరెస్టులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి విఒఎల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాకు బయలుదేరిన విఒఎలను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డగించారు. తెల్లవారుజామునే నాయకులను అరెస్టు చేశారు. అరెస్టులను నిరసిస్తూ పలుచోట్ల విఒఎలు ధర్నా చేశారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో సిఐటియు నాయకులను, విఒఎలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలానికి చెందిన విఒఎలను పోలీసులు అరెస్టు చేసి నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలిచారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోనూ మహాధర్నాకు సిద్ధమై వెళ్తున్న విఒఎలను అరెస్ట్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలానికి చెందిన ముగ్గురు గ్రామ దీపికలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు

తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు గ్రామదీపికలను ఆదివారం రాత్రే పోలీసులు నిర్బంధించారు. ఇంత నిరంధం విధించినా విఒఎలు మొక్కవోని దీక్షతో తెగించి హైదరాబాద్ ఇందిరాపార్కు వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, వేములపల్లి, మాడుగులపల్లి మండలాల్లోని విఒఎలు హైదరాబాద్‌కు బయలుదేరగా.. మార్గమధ్యలో మాడుగులపల్లి మండల కేంద్రంలో టోల్ ప్లాజా వద్ద పోలీసులు అడ్డగించి మందిని అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి టోల్‌గేట్ వద్దకు చేరుకుని వీవోఏలతోపాటు ధర్నాలో పాల్గొన్నారు. ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు అనుమతి ఉన్నప్పటికీ అడ్డుకోవడం.. అరెస్టు చేయడం ఏంటని పోలీసులను నిలదీశారు. విఒఎలను పంపించాలని పోలీసు ఉన్నతాధికారితో ఫోన్‌లో రంగారెడ్డి మాట్లాడారు. అనంతరం విఒఎలందరినీ వాహనాలు ఎక్కించి హైదరాబాద్ పంపించారు. నల్లగొండల్లో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండం పల్లి సత్తయ్యను, జిల్లా ఉపాధ్యక్షులు నారబోయిన శ్రీనివాసులు, తిప్పర్తి, చిట్యాల, మాడుగులపల్లి, అనేక చోట్ల విఒఎలను హైదరాబాదు వెళ్లకుండా అడ్డుకొని ముందస్తు అరెస్టులు చేశారు. చిట్యాలలో సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకు సిపిఎం నాయకులను ఇళ్ల వద్దే అరెస్టు చేశారు.

బిజెపి అండతోనే గిరిజనులపై దాడులు : టిఎజిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లో ఆదివాసీ కుకీ, నాగ గిరిజన తెగలపై బిజెపి అండతో జరుగుతున్న దాడులను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. గిరిజనులపై దాడులు ఆపడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని, మతోన్మాదులను కఠినం శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. మణిపూర్ రాష్ట్రంలో రెండు మాసాలుగా కుకీ, నాగ ఆదివాసీ గిరిజన తెగలపై మతోన్మాద శక్తుల దాడులతో అట్టుడుకుతోందన్నారు. కేంద్రంలో, మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి గిరిజనులపై దాడులను అరికట్టడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్ర జనాభాలో మెజారిటీగా ఉన్న మైతీ కులస్తులలో తమ బలాన్ని సుస్థిరం చేసుకోవడానికి బిజెపి చేస్తున్న కుట్రలో భాగంగానే మణిపూర్‌లో కుకీ, నాగ ఆదివాసీ గిరిజన తెగలపై దాడులని పేర్కొన్నారు. తన రాజకీయ లబ్ది కోసం రాష్ట్ర జనాభాలో 54శాతం ఉన్న మైతీ కులస్తులను గిరిజన తెగల జాబితాలో చేర్చడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. తద్వారా రాష్ట్ర జనాభాలో మైనారిటీగా ఉన్న కుకీ, నాగ గిరిజన తెగల హక్కులను దెబ్బతీయాలని చూస్తోందని పేర్కొన్నారు. కుకీ, నాగ తెగలను అడవి నుంచి గెంటేయాలని, వారి ఆధీనంలో ఉన్న భూములను గిరిజనేతరులైన మైతీలకు కట్టబెట్టాలని ప్రయత్నిస్తోందన్నారు. అందుకు ఆటంకంగా ఉన్న గిరిజన చట్టాలను అతిక్రమించడానికి మైతీలను గిరిజనులుగా మార్చే ప్రయత్నాలకు కేంద్రప్రభుత్వం తెరతీసిందని పేర్కొన్నారు. దీన్ని ప్రతిఘటించిన కుకీ, నాగ గిరిజన తెగలపై బిజెపి అండతో మతోన్మాద శక్తులు దాడులకు పాల్పడుతున్నాయన్నారు. గిరిజనుల ఇండ్లను, ఆస్తులను, చర్చీలను ధ్వంసం చేశారని, 70మందికి పైగా చనిపోయారని పేర్కొన్నారు. శాంతియుతంగా కలిసి మెలిసి జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర ప్రజల మధ్య బిజెపి చిచ్చు పెట్టి మణిపూర్ రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మార్చిందని తెలిపారు. మణిపూర్ ఆదివాసీ గిరిజనులపై జరుగుతున్న జాతి ఉన్మాద, మతోన్మాద దాడులను ప్రజలంతా తీవ్రంగా ఖండించాలని, కుకీ, నాగ ఆదివాసీ గిరిజన తెగలపై మతోన్మాద శక్తుల దాడులను అరికట్టేందుకే తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

పొంగులేటి, జూపల్లి బిజెపిలో చేరడం కష్టమే

నాకే రివర్స్ కౌన్సెలింగ్ ఇచ్చారు : ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హబైదరాబాద్ బ్యూరో

భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) బహిస్కృత నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు బిజెపిలో చేరికపై హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారిద్దరూ బిజెపిలో చేరడం కష్టమే అని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఈటల సోమవారం మీడియాతో మాట్లాడారు."ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉంది. బిజెపి బలంగా లేదు. పొంగులేటి, జూపల్లితో నేను రోజూ మాట్లాడుతున్నాను. వారే నాకు రివర్స్ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇప్పటివరకు వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరకుండా మాత్రమే నేను ఆపగలిగాను. బిజెపిలో చేరేందుకు వారికి కొన్ని ఇబ్బందులున్నాయి. ఇప్పటికీ కమ్యూనిస్ట్ ఐడియాలజీ ఉన్న జిల్లా ఖమ్మం. దేశానికి కమ్యూనిస్టు సిద్ధాంతం నేర్పిన గడ్డ తెలంగాణ. ఖమ్మంలో వామపక్షాలు, టిడిపి సహా అన్ని పార్టీలుంటాయి. ప్రియాంక గాంధీని అప్పట్లో పొంగులేటి కలిశారని తెలిసింది. అంతకంటే ముందే ఖమ్మం వెళ్లి పొంగులేటితో చర్చించాను" అని ఈటల వ్యాఖ్యానించారు.

డికె శివకుమార్‌తో షర్మిల భేటీ

రాజకీయాలపై చర్చ

ప్రజాశక్తి-హైదరాబాద్

కర్నాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం బెంగళూరులోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా వారి మధ్య రాజకీయ చర్చ జరిగినట్టు తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బాధ్యతలు తీసుకుని వైఎస్ఆర్ ఆశయాలకు అనుగుణంగా అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని డికె శివకుమార్ షర్మిలను కోరినట్టు తెలిసింది. ఏపీలో వైఎస్ఆర్, టీడీపీలను ఎదుర్కొనేందుకు షర్మిల బలమైన నేతగా కాంగ్రెస్ భావిస్తున్నది. ఇప్పటికే ఎఐసిసి అగ్రనేత ప్రియాంకగాంధీ కూడా షర్మిలతో మాట్లాడినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, వైఎస్ఆర్‌టిపి పొత్తు పెట్టుకునేందుకు డికె రాయబారం చేస్తున్నట్టు మరో వాదన కూడా వినిపిస్తున్నది. 15 రోజుల్లోనే డికెతో షర్మిల రెండుసార్లు భేటీ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎసిపి హనుమంతరావు

భద్రత సమిష్టి బాధ్యత

ఎమర్జెన్సీపై మెడికవర్ హాస్పిటల్ కార్యక్రమంలో ఎసిపి

ప్రజాశక్తి - హైదరాబాద్

వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా మాదాపూర్ హైటెక్ సిటీ ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులచే ప్రజలకు అత్యవసర సమయంలో ఎలా స్పందించాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదాపూర్ ట్రాఫిక్ ఎసిపి హనుమంతరావు హాజరై మాట్లాడుతూ.. "భద్రత అనేది ప్రతి వ్యక్తితో మొదలయ్యే సమిష్టి బాధ్యత. ఈ మధ్యకాలంలో చాలావార్తల్లో వింటూనే ఉన్నాం. రోడ్ మీద వెళ్తూ, అటుకుంటూ లేక డాన్స్ చేస్తూ చనిపోవడం గమనిస్తూనే ఉన్నాం. అటువంటి అత్యవసర సమయాల్లో ఈ విధంగా స్పందించాలో దాని గురించి మనకు అవగాహన కల్పించడం ద్వారా ఎమర్జెన్సీ రెస్పాన్స్, ట్రామా కేర్, మన జీవితాలను మాత్రమే కాకుండా మన తోటి వారి ప్రాణాలను కూడా మనం రక్షించగలం." అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ పలు విభాగాల డాక్టర్లు రంజిత్, విక్రమ్ కిషోర్ రెడ్డి, సతీష్ కైలాసం, విక్రమ్, మాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శిరీషను సత్కరిస్తున్న నాట్య గురువులు

శిరీషకు స్వర్ణ కంకణ సత్కారం

ప్రజాశక్తి-కల్చరల్

గత రెండు దశాబ్దాల కాలంలో వందల మంది శిష్యులకు నాట్యంలో ఉత్తమ శిక్షణ ఇచ్చిన టివి శిరీషను శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో ఘన సత్కార సభ జరిగింది. శిరీష శిష్య బృందం తొలుత కూచిపూడి శైలిలో నాట్య అంశాలు మనోహరంగా నర్తించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో కళా పోషకుడు చిల్ల రాజశేఖర రెడ్డి అధ్యక్షతన శిరీష శిష్య బృందం స్వర్ణ కంకణం బహుకరించి గురు పూజ చేశారు. ముఖ్య అతిథిగా ప్రముఖ నాట్య కళాకారిణి ప్రసన్న లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ శిష్యులకు ఉత్తమ గురువు దొరకటం గురువుకు శ్రద్ధ కల శిష్యుడు దొరకటం సుకృతం అన్నారు. శిరీష నాట్య గురువే కాక, కవయిత్రిగా నవ తెలంగాణ తదితర పత్రికలలో వివిధ అంశాలపై కవితలు రాసారని వివరించారు. నాట్య గురువు రేణుకా ప్రభాకర్, న్యూస్ ప్రెజెంటర్ మాధురి దీక్ష, సంస్థ సారధి జి వెంకట రెడ్డిలు శిరీషకు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు.